# ★ సుప్తాస్థికలు ★

★ శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు ★

★

పరిత్రాణాయ సాధూనాం । వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ । సంభవామి యుగే యుగే.

శిష్టమానవ రక్షణ సేయుకొరకు । దుష్టమానవ నాశనోద్యోగమునకు
ధర్మ సంస్థాపనము నిమిత్తము ధరిత్రి । యుగయుగమ్ముల నుందు నే నుద్భవింతు.

ప్రకటన

సుప్తాస్థికలు: నిద్రపోతున్న ఎముకలు. ఎముకలు నిద్రపోతాయా? ఏమో. పోనీ, నిద్రిస్తాయనే అనుకుందాం. నిద్రించడం తప్ప మరేమీ చెయ్యలేవనే అనుకుందాం. నిద్రిస్తాయి కాబట్టి కలలు కూడా కంటాయా? ఏమో ఒక కవి యిలా అన్నాడు.

కవి

అవి ధరాగర్భమున
మానవాస్థికా పరంపరలు!
సుప్త నిశ్శబ్ద సంపుటములు!
అటనొకే దీర్ఘయామిని!
ఆ నిశా శ్మశాన శయ్యకు
ప్రాతః ప్రసక్తి లేదు!
ఆయుగమ్యతమో రహస్యాంగణాన
తాండవించును
మృత్యు శైత్య మొకటె
అవి నితాంత హేమంత
హృదంతరంత రనుభవాళి
ఘనీభవించిన సమాధులు.

ఆ మనుష్యాస్థికలు
నిద్రలో మునింగి
సంచరించును భైరవస్వప్నవీథి
అవిచలించును తమ
చర్మ కవచ మెపుడో
బ్రతికిన దినాల
తలపోత బరువు చేత
నా కనుంగవ కన్నీళు లైకరంగు
నవియొనర్చెడు నీరవాహ్వాన మెరిగి

ఇంత శోషిల్లునేలో
నాహృదయ పుటము
వణకు నేటికో నా అస్థిపంజరమ్ము

ప్ర క ట న

అస్థికలు, సుప్తాస్థికలు! అయితే?
అదా! సుప్తి. రాత్రి. చీకటి-నిశ్శబ్దం
మరణం! ఎముకలు మరణానికి
చిహ్నం కాబోలు. ఎవరి మరణం,
ఏమి టిదంతా? ఇదంతా దేన్ని
గురించి? ఏదో ఉపద్రవం సంభ
వించినట్లు ఏమిటా రోదన నాదం?
ఏం జరిగింది? అలా కొట్టుకుంటు
న్నాయేం మీ గుండెలు? ఏం
ఘోరం? ఏం విపత్తు? ఎవరు
పోయారు? ఏమిటిదంతా? ఎవరు?
ఎవరో మీ ఆత్మలకన్న ఆత్ముడూ
ఆప్తుడూ ఎవరో మహాపురుషుడో,
మహాత్ముడో మీకు దూరంఅయి
పోయాడా? ఎవరికీ కనబడకుండా
ఎక్కడికో వెళ్లి పోయాడా? ఇదంతా
యేమిటి? ఎందుకీ యేడుపులు?

విషాద కంఠాలు

ఏమని చెప్పమంటావు
ఎందుకేడుస్తున్నామో?
ఎందుకేడుస్తున్నామో
ఏమో మాకే తెలియదు!

ఏమిటిదంతా అంటావా?
ఏమో మాకూ తెలియదు!
ఎవరు? ఎందుకు? ఏమిటి?
ఇవన్నీ మాకేం తెలియదు.
ఎప్పుడు? ఎక్కడ? ఎలాగ?
ఏం ప్రశ్నలయ్యా! ఇవి?
నోరులేని గాలి నడుగు,
ఆవులించిన ఆకాశాన్నడుగు!
ఔను! ఘోరమే జరిగింది!
అనుకోనిదె నిజమయింది
ఎందుకా ఏడుస్తున్నాం అని
ఇంకా అడుగుతున్నావా?
ఒకళ్లూ ఇద్దరూ కాదు
ఒక కుటుంబం ఊరూ కాదు
ఒక నగరం ఒక రాష్ట్రం కాదు
ఒక దేశం ఒక ఖండం కాదు
సమస్త ప్రపంచం నేడు
సమగ్రదుఃఖంలో మునిగిందయ్యా!
అమేయ మీ ఉపద్రవానిది
అంతర్జాతీయ పరిమాణం!
అమెరికాలో సాహుకారు,
ఆఫ్రికాలో నీగ్రో
భవనంలో మహారాజు
ఫ్యాక్టరీలో కూలీ
ఒకళ్లూ ఇద్దరూ కాదు
వందలూ వేలూ కాదు

ధరిత్రి ఈ కొసనించి ఆ కొసకి
దద్దరిల్లిపోయిందయ్యా !
ఇంకా ఏమని చెప్పమంటావు
ఎందుకేడుస్తున్నామో ?
హిమాలయం మా
హృదయభారం !
గంగానది మా కన్నీళ్లు !

ప్రకటన

ఔను ఔను, నాకర్థమవుతోంది. మిమ్మల్ని ఓదార్చడానికి ప్రయత్నించను. అయినా ఇటు చూడండి. ఈ శ్మశాన ప్రశాంతిని ! హెచ్చు తగ్గులు లేని ఈ మైదానాన్ని చూడండి. మృత్యువు భయంకరమైనదని మీ ఉద్రేకం చెబుతుందేమో కాని ఈ ప్రాంతం ఎంత ప్రసన్నమో ఒక్కసారి ఆలోచించి చూడండి ! ఎవరో ఇటు వస్తున్నారు.

సంధ్య

నేను సంధ్యని
దివసమ్మునకు వయోధికత
ప్రాప్తించినది
తీక్ష దీప్తులడంగి దినరాజు
కృశియించె !
వృద్ధాప్త మిడినదీవెనచేత
జనియించి
ఔద్ధత్యమునచే అహర్పతిన్
మ్రింగితిని ;
ఈ నా భవమ్ములో కానంద
మొసగునా
నే నెప్పటికి కూడ ఇటు
వికాసింతునా ?
నా కే నిముసమేని
లేకుండునా స్మృతి ?
ఇట మాయమైన నాకెట
సమున్మేషమో?

అంధకారం

నేను చీకటిని.
ఈ దివారోచిస్సుధా
ధామమును గూల్చి
ప్రాదుర్భవించి నే
బయలుదేరిన యంత
జగతియోమోకాని
నగవే మరచిపోయి
వగపుచే నిట్టూర్చి
వనటచే తపియించు
నా మేలిముసుగులో
నలుపు లూరెడు నంట
నామీద జగతి కింతయు
ప్రేమ లేదంట !

నక్షత్రం

నేను నక్షత్రాన్ని.
నీలోత్పల నికాశ

వీరా నిశీథము నిండి
ఎలుగెత్తి యేడు
వెందుల కంధకారమా ?
వాగులైనా ప్రేమ
వరియించు నేనిన్ను
స్వాగతమ్మొసగు
నాశాగంధ వాయువుల్
నిలువలేనే నీవు
నిలిచియుండని వేళ
వెలుగలేనే నీవు
విస్తరిల్లని వేళ!
నీ కాటుకల చేత నా కనుల్
వికసించు !
నీకు నేనే, నాకు నీవె
ఈలోకాన !

ప్రకటన

మృత్యువు జగద్విజేత కావచ్చును. కాని మరణాన్ని ప్రేమజయిస్తుంది.

ఒకగొంతు

సకల ప్రాణులనూ సమానంగా ప్రేమించ గలిగిన వ్యక్తికి మరణమా ? ఇది నిజమని ఎలా నమ్మడం ?

రెండవ

పుష్పక విమానంలోవలె అతని హృదయంలో ఎంద రధివసించినా ఇంకా స్థలం ఉండనే ఉంటుంది.

మూడవ

ఎన్ని గ్రంథాలు చదివినా మానవ మేధస్సులో ఇంకా కొత్తభావాలకి తావున్నట్లు.

బృందగీత

చీకట్లతోటలో కన్నీటి లోయ
కన్నీళ్ల లోయలో, కారుణ్య రేఖ.
పాపాలకోనలో
పసిపాప నవ్వు
చీకట్ల కోటలో
చిన్నారి వెలుగు
మృత్యు నిశ్శబ్దాన
మృదు జీవ రవళి
ఎముకల నిద్రలో
ఇంపైన కలలు.

ప్రకటన

అదుగో ! అదుగో! అటు చూడండి. భయంకర చితాగ్ని జ్వాలలనుండి పైకి లేస్తున్న ప్రశాంత తేజాన్ని చూడండి! అతని భౌతికశరీరం అగ్నికాహుతి అయింది. అతని అనశ్వరాత్మ ఆకాశాల నాక్రమించింది.

బృందగీత

అతడు సామాన్య వ్యక్తి
అత డసామాన్య వ్యక్తి
తృణం కన్నా తేలిక
మేరువు కంటే ధీరుడు!

ఆగర్భ (శ్రీ)మంతుడు!
నిత్య దరిద్ర నారాయణుడు!
వయస్సుమీరిన బడుగు,
వయస్సే లేని నిసువు!
అన్యాయం సమక్షంలో
ఆగ్రహోదగ్రమూర్తి
చరాచర ప్రపంచానికి
క్షమా మార్గదర్శి
అత డిప్పుడు లేడు
అత డెప్పుడూ ఉన్నాడు
అమరత్వం అందుకున్న
అతనికి మా నతులు!

ప్రకటన

అరే! ఎవరూ లేరే? ఎంత శూన్యంగా ఉందో ఈ స్థలమంతా? ఏదీ చితి, ఏదీ జ్వాల? ఏవీ అస్థికలు? ఏదీ బూడిద? ఏవీ లేవే? అన్ని వస్తువులూ తమ ఆకారాన్ని పరిత్యజించినట్టుందే? అంతా శూన్యాకాశం? నిర్జన నిర్జీవ నిరుపాధిక నిశ్శబ్దం. (క్షణంనిశ్శబ్దం)

ఈనిరవధిక నిశ్శబ్దంలో ... ... ఏమిటా గుసగుసలు. వెలుగూ చీకటీ కాని, బుద్ధికీ కంటికీ అందని ఈవిచిత్రాకాశపథంలో ఒకసోదర తార సహస్రకోటి యోజనాల దూరంలో ఉన్న ఇంకొక సోదరీ తారతో సంభాషిస్తోంది.

౧ వ తార

అక్కా! ఒసే చుక్కా!

౨ వ తార

ఏం తమ్ముడూ!-

౧ వ తార

అదేమే అలా తుళ్ళిపడి లేచావూ?

౨ వ తార

ఏం లేదు. నిద్రపోదూ!

౧ వ తార

మరి నువ్వెందుకు మేలుకున్నావూ? ఎందుకే అలా వణుకుతున్నావు?

౨ వ తార

ఏం లేదు. పడుక్కుందూ. ఏమిటో నిద్రలో వినబడింది.

౧ వ తార

ఏమిటేఅక్కా, ఏమిజరిగిందేమిటి? ఏం వినబడిందినీకు?

౨ వ తార

అబ్బ! ఏంలేదు పోనిద్దూ!

౧ వ తార

కాదే, చెప్పవే?

౨ వ తార

ఏముందిలెద్దూ, ఎక్కడో భూగోళంలో, మినుకు మినుకుమనే భూగోళంలో, సరిగ్గా కనబడీ కనబడని భూగోళంలో-

౧ వ తా ర

ఆఁ—ఆఁ, ఏమయిందే ?

౨ వ తా ర

భూగోళం మీద హస్తినాపురం అనే ఊరుంది. దాని ప్రస్తుతం పేరు నాకు తెలియదు... వింటున్నావా?

౧ వ తా ర

ఆఁ-వింటున్నాను. హస్తినాపురం అనే ఊళ్లో-

౨ వ తా ర

నాలుగు సార్లు రివాల్వరు పేలుడు వినిపించింది.

౧ వ తా ర

రివాల్వరా? రివాల్వరంటే ఏమిటే?

౨ వ తా ర

రివాల్వరంటే తెలియదూ ? ఆటం బాంబుకి ముత్తాత.

౧ వ తా ర

ఆటం బాంబు అంటే ఏమిటి ?

౨ వ తా ర

అబ్బ ఊరుకుందూ ! నీ ప్రశ్నలకు జవాబు చెప్పలేక పోతున్నాను.

౧ వ తా ర

పోనీలేవే అక్కా— పోనీ ఇది చెప్పు నాలుగు మోతలు వినడం వల్లనా నీకు నిద్రాభంగం అయింది ?

౨ వ తా ర

కాదు తమ్ముడూ ! వినుమరి !

ఆ రాక్షస ధ్వనుల నాల్గింటినీ మరో నాలుగు అక్షరాలు రెండు రెళ్లు నాలుగక్షరాలు ఎదుర్కొన్నాయి ! ఎంత పెద్ద యుద్ధమనుకున్నావు ? ఇప్పటికీ జరుగుతూనే ఉంది ! హింసకీ అహింసకి యుద్ధం! అబ్బా, ఇంకా వినబడుతూనే ఉంది! ఎలా కొట్టుకుంటున్నాయో నా గుండెలు !

౧ వ తా ర

ఏమిటే ఆ అక్షరాలు నాలుగూ ?

౨ వ తా ర

'హేరాం ! హేరాం !' అని.

౧ వ తా ర

అంతేనా అక్కా ? అంతేనా ? నాలుగుమార్లు రివాల్వరు చప్పుళ్లు 'హేరాం హేరాం' అనే గద్గద స్వరాలూ! అంతేకాదూ, అంతేనా?

౨ వ తా ర

అంతే అనా అడుగుతున్నావు తమ్ముడూ! అలా ఆవలిస్తున్నావేం?

౧ వ తా ర

అబ్బా, నిద్దరొస్తోందే !

౨ వ తా ర

నీకెలా నిద్దర పడుతోందిరా తమ్ముడూ

[ పరిత్రాణాయ సాధూనాం... ]

[ఆలిండియా రేడియోకి కృతజ్ఞత]